www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 13 జూన్ 2023

వైసిపికి గుబులు పుట్టిస్తున్న మినీ మేనిఫెస్టో

-టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి

మాట్లాడుతున్న నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

తెలుగుదేశం పార్టీ మినీ మేనిఫెస్టోతో వైసిపి నాయకుల గుండెల్లో గుబులు పుట్టిందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ పాలనలో యువత జీవితాలు అంధకారంలోకి నెట్టిందన్నారు. చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టోలో మహిళలు, రైతులు, బిసిలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. 2024 ఎన్నికల్లో టిడిపి విజయం సాధించాలన్న లక్ష్యంతో చంద్రబాబు మిని మ్యానిఫెస్టోను విడుదల చేశారని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి శ్రేణులు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు పాల్గొన్నారు.

బద్వేలులో అభివృద్ధి నిల్.. భూకబ్జాలు ఫుల్

- బద్వేలు బహిరంగ సభలో నారా లోకేష్

బద్వేలు బహిరంగ సభలో మాట్లాడుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి-బద్వేలు/గోపవరం

బద్వేల్‌ని బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తారని వైసిపిని భారీ మెజారిటీతో గెలిపించారని, ఇక్కడ అభివృద్ధి నిల్ అని, భూకబ్జాలు ఫుల్ అని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 124 రోజుకు చేరుకుంది. సోమవారం బద్వేలు నియోజకవర్గం బద్వేలు మండలంలోని విద్యానగర్ విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభమై ఎన్‌జి.కాలనీ, సిఎస్ఐ చర్చి, ఆర్‌టిసి బస్టాండ్, నాలుగు రోడ్ల కూడలి, పోరుమామిళ్ల బైపాస్, గోపవరం మండలంలోకి ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి శ్రీనివాసపురం, పిపి కుంట విడిది కేంద్రం వరకూ పాదయాత్ర సాగింది. ఆయా ప్రాంతాల్లో స్థానికులు, క్రిష్టియన్లు, ఎస్‌సి సామాజిక వర్గీయులు, స్థానికులతో ముఖాముఖి, మాటామంతి, సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా బద్వేలు ఆర్‌టిసి బస్టాండ్ వద్ద నిర్వహించిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ బద్వేల్ ఎమ్మెల్యే స్థలాన్నే వైసిపి నాయకులు కబ్జా చేసారంటే ఉమ్మడి కడప జిల్లాలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. రూ.2 వేల కోట్ల విలువైన ప్రభుత్వ, ప్రైవేట్ భూములు కబ్జా చేశారన్నారు. ఎమ్మెల్సీ గోవిందరెడ్డి బద్వేల్‌ని మండలాల వారీగా కేకులా కోసి బంధువులకు పంచేశారన్నారు. గోవిందరెడ్డి, వైసిపి నేతలు రమణారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, గురు మోహన్, శ్రీరాములు, పోల్‌రెడ్డి, ఎల్లారెడ్డి కలిసి రెండు వందల కోట్లు విలువైన ప్రభుత్వ, ప్రైవేట్ భూములు కొట్టేశారని పేర్కొన్నారు. ఆర్డీవో వెంకటరమణ 40 మంది వైసిపి నాయకుల లిస్ట్ బయటపెట్టారని తెలిపారు. వైసిపి నాయకుల్ని తప్పించి అనామకులపై కేసులు పెట్టి చేతులు దులుపుకున్నారని చెప్పారు. వైసిపి నేతలు యోగానందరెడ్డి, వెంకటరెడ్డి, పిచ్చిరెడ్డి పోరుమామిళ్ల-బద్వేల్ రోడ్డు పక్కనే ఉన్న రూ.150 కోట్ల విలువైన 200 ఎకరాలు ఆక్రమించారని తెలిపారు. పోరుమామిళ్లలో ఫుడ్ కమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి రూ.300 కోట్ల విలువైన భూమిని కబ్జా చేసి అమ్మేశాడన్నారు. కలసపాడు వైసిపి నేత గురివిరెడ్డి ఆసుపత్రి భూమినే లేపేశాడన్నారు. బద్వేల్ మున్సిపాలిటీలో ఏ అభివృద్ధి కార్యక్రమం జరగాలి అన్నా చైర్మన్ రాజగోపాల్‌రెడ్డికి కాంట్రాక్టర్లు 23 శాతం కప్పం కట్టాల్సిందేని, అందుకే కాంట్రాక్టర్లు పనులు చేయాలంటే చేతులు ఎత్తేశారని పేర్కొన్నారు. జగన్ బద్వేల్, గోపవరం, అట్లూరు మండలాలకు సోమశిల బ్యాక్ వాటర్ వద్ద లిఫ్ట్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేసి సాగునీరు అందిస్తాం అని హామీ ఇచ్చాడన్నారు. వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేసి పోరుమామిళ్ల, కలసపాడు మండలాలకు రెండేళ్లలోనే సాగు, తాగునీరు అందిస్తాం అని చెప్పి మోసం చేసాడని పేర్కొన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి సాగు, తాగు నీరు సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఎన్నికల ముందు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగస్తులందరినీ పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చాడన్నారు. నాలుగేళ్ళ నిద్రపోయాడని ఇప్పుడు కాంట్రాక్టు ఉద్యోగస్తులను మోసం చేయడానికి కొత్త డ్రామా మొదలు పెట్టారని తెలిపారు. ప్రజల్ని హింసిస్తే పులకేశి జగన్‌కి మజా వస్తుందన్నారు. సిఎం గా ప్రమాణస్వీకారం చేస్తూ కరెంట్ బిల్లులు తగ్గించేస్తానని, వందల్లో బిల్లు వచ్చే వారికి వేలల్లో వస్తోందని పేర్కొన్నారు. 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచాడన్నారు. స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ ఛార్జీలు అంటూ బాదుడే బాదుడని తెలిపారు. ఇసుక వ్యాపారంలో జగన్ బంధువు వీరారెడ్డి మోసం చేసాడని పోరుమామిళ్లకు చెందిన నారాయణ రెడ్డి ఆత్మహత్యాయత్నం చేసాడని పేర్కొన్నారు. ప్రతి రోజు ఇసుక అక్రమ రవాణాలో జగన్ వాటా రూ.3 కోట్లన్నారు. ఆర్టీసీ బస్ ఛార్జీలు 3 సార్లు, ఇంటి పన్ను, చెత్త పన్ను, పెట్రోల్, డీజిల్ ధరలు, నిత్యావసర సరుకుల ధరలు పెంచేశారని విమర్శించారు. సంపూర్ణ మద్యపాన నిషేధం తర్వాతే ఓట్లు అడుగుతా అన్నాడని ఇప్పుడు ఏ మొఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నాడని తెలిపారు. 45 ఏళ్లకే బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు పెన్షన్ అని చెప్పాడన్నారు. పెన్షన్ దేవుడెరుగు పాపం మహిళలు దాచుకున్న అభయహస్తం డబ్బులు రూ.2500 కోట్లు కొట్టేశారని పేర్కొన్నారు.. ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి అమ్మ ఒడి ఇస్తా అని మోసం చేశారన్నారు. జాబ్ కేలండర్ ప్రకటించలదేని తెలిపారు. 2.30 లక్షల ఉద్యోగాలు ఇవ్వలేదని చెప్పారు. ప్రతి ఏటా 6,500 పోలీసు ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. గ్రూప్-2 లేదని, డిఎస్‌సి లేదని, ఉన్న అంబేద్కర్ స్టడీ సర్కిల్స్, బీసీ స్టడీ సర్కిల్స్ మూసేశారని పేర్కొన్నారు. జిఒ 77 తీసుకొచ్చి ఉన్నత విద్య చదువుతున్న వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం రద్దు చేసాడన్నారు. అధికారంలోకి వస్తే ప్రభుత్వ, ప్రైవేట్, స్వయం ఉపాధి ద్వారా 5 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. నిరుద్యోగ యువతకు యువగళం నిధి కింద నెలకు రూ.3000 ఇస్తామన్నారు. ప్రతి ఏడాది నోటిఫికేషన్ ఇస్తామని, అన్ని జిల్లాల్లో స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. మీటర్లు రాయలసీమ రైతులకు ఉరితాళ్లని తెలిపారు. రైతుల ఆత్మహత్యల్లో ఏపి దేశంలోనే నంబర్ 3గా ఉందని, కౌలు రైతుల ఆత్మహత్యల్లో నంబర్ 2గా ఉందని చెప్పారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నదాతకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని, పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర ఇచ్చే బాధ్యత మాదన్నారు.

చదువే తలరాతను మారుస్తుంది : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

జగనన్న విద్యా కానుక విద్యార్థుల బంగారు భవితకు బాట వేస్తుందని, చదువే పేదవాడి తలరాత మారుస్తుందని కలెక్టర్ గిరీష పి.ఎస్ తెలిపారు. సోమవారం రాయచోటి లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా విద్యా , సమగ్ర శిక్ష శాఖల ఆధ్వర్యంలో 'జిల్లాలో ఒకటి నుండి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక -4' కింద ఉచితంగా కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులందరూ బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యారంగంలో ప్రభుత్వం అనేక మార్పులు తీసుకొచ్చిందని, నాలుగేళ్లల్లో రూ.60 వేల కోట్లను విద్యారంగానికి ప్రభుత్వం ఖర్చు పెట్టిందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా బడులు తెరిచిన తొలి రోజు నుండే ఉచిత విద్యా కానుక కిట్ల పంపిణీ చేయడం మనందరికీ గర్వకారణమన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి జిల్లాలో 1709 ప్రాథమిక పాఠశాలలు, 214 ప్రాథమికోన్నత పాఠశాలలు, 296 ఉన్నత పాఠశాలల్లోఅన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న 75,435 మంది బాలికలు, 79,354 మంది బాలురకు విద్యా కానుక కిట్లను అందిస్తున్నట్లు చెప్పారు. ఇందులో ప్రతి విద్యార్థికీ ఉచితంగా బైలింగ్వల్ పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, వర్క్ బుక్కులు, మూడు జతల యూనిఫాం (క్లాత్ కుట్టుకూలీతో సహా), ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, స్కూలు బ్యాగుతో పాటు 6-10 తరగతి పిల్లలకు ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీషు-తెలుగు డిక్షనరీ, 1-5 తరగతి పిల్లలకు పిక్టోరియల్ డిక్షనరీతో కూడిన విద్యా కానుక కిట్‌ను తల్లిదండ్రులపై భారం లేకుండా ప్రభుత్వమే ఉచితంగా అందిస్తోందని పేర్కొన్నారు. ఈ కిట్లను విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి తల్లికి అమ్మ ఒడి కింద రూ.15 వేలు, జగనన్న విద్యాదీవెన కింద పెద్ద పెద్ద చదువులకు ఎంత ఖర్చైనా ఫీజు రియంబర్స్‌మెంట్, జగనన్న గోరు ముద్ద పథకాలను ప్రభుత్వం పటిష్టవంతంగా అమలు చేస్తోందన్నారు. గ 20, 30 సంవత్సరాలుగా పాడైపోయిన ప్రభుత్వ పాఠశాలలను దేశంలో ఎక్కడా లేని విధంగా నాడు నేడు కార్యక్రమంతో కార్పొరేట్‌కు ధీటుగా ఆధునిక పాఠశాలలుగా తీర్చిదిద్దారని చెప్పారు. ప్రతి పాఠశాలలో 10 రకాల మౌలిక వసతులను సమకూర్చారని తెలిపారు. పిల్లలందరూ ఏ రంగంలో అయినా ఇష్టపడి చదవాలని పదవ తరగతితోనే ఆగిపోకుండా ఇంటర్, డిగ్రీ, పీజీ, సాంకేతిక విద్యలు అభ్యసించాలన్నారు. ప్రపంచీకరణతో ఎన్నో రంగాలలో అవకాశాలు ఏర్పడ్డాయి. వాటిలో నిపుణుల కొరత ఉంది. బాగా చదువుకున్న వారికి నేడు అనేక అవకా శాలతో పాటు ఉద్యోగాలు వస్తాయన్నారు. తల్లిదండ్రులు పిల్లలను బాగా చదివిం చాలని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ భాష మాట్లాడుతూ కులాలు, మతాలకు అతీతంగా ముఖ్యమంత్రి జగనన్న పారదర్శకంగా పాలన చేస్తున్నారు. విద్యారంగం, వైద్య రంగంలో సంస్కరణలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతున్నారు. డిఇఒ ఎస్.పురుషోత్తం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు, సంస్కరణలను తీసుకొచ్చిందన్నారు. పేదరికం ఏ విద్యార్థికి అడ్డు కారాదని అమ్మ ఒడి, విద్యా దీవెన, విద్యా కానుకలను ప్రభుత్వం ఇస్తోందన్నారు. నాడు నేడు ద్వారా ప్రతి విద్యార్థి మంచి వాతావరణంలో చదువుకునేలా ప్రతి పాఠశాలలో వసతులు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం కలెక్టర్, మున్సిపల్ చైర్మన్ విద్యార్థులకు ఉచితంగా జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా కో-ఆర్డినేటర్ దివాకర్, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, కౌన్సిలర్ నరసింహారెడ్డి, ఎంఇఒ బాలాజీ నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సైదాబాను, పాఠశాల కమిటీ చైర్మన్ స్వర్ణలత, విద్యార్థినిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థికి జగనన్న విద్యా కానుక కిట్లను అందజేస్తున్న కలెక్టర్, మున్సిపల్‌చైర్మన్

బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి : జెసి

ర్యాలీని ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - రాయచోటి

బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని, ఇది అందరి బాధ్యతని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. సోమవారం పట్టణంలోని బంగ్లా కూడలి నుంచి జిల్లా చైల్డ్ లేబర్ శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వరకు ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవంపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ అవగాహన ర్యాలీని జాయింట్ కలెక్టర్ జండా ఊపి ప్రారంభించారు. అంతకముందు ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవంలో భాగంగా బాల కార్మిక నిర్మూలన కోసం అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని, పిల్లలను చదివించాలని ర్యాలీలో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని, బాల కార్మిక వ్యవస్థను అంతం చేద్దామని పిలుపునిచ్చారు. బాలలందరిని బడికి పంపించి భావి భారత పౌరులుగా తీర్చి దిద్దుదామన్నారు. స్వచ్ఛంద సంస్థలతో పాటు, అన్ని శాఖల అధికారులు ఈ వ్యవస్థను నిర్మూలించడానికి కృషి చేయాలన్నారు. బాలకార్మిక వ్యవస్థ కొనసాగడం వల్ల సమాజంలో అనిశ్చిత పరిస్థితులు పెరుగుతాయన్నారు. అందరూ తమ పిల్లలను చదివించాలన్నారు. తమ పరిధిలో ఎక్కడైనా బాలకార్మిక వ్యవస్థ ఉంటే వెంటనే తమకు సమాచారం అందించాలని, కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో కార్మిక శాఖ జిల్లా అధికారి డివి నాగరాజు, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, ఐసిడిఎస్ పీడీ ధనలక్ష్మి పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్: పట్టణంలో చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పిల్లలు బడికి పెద్దలు పనికి, పని వద్దు చదివే ముద్దు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలిద్దామంటూ నినాదాలు చేస్తూ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎంపి ఆనందన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ కమిటీ డైరెక్టర్ డాక్టర్ జివిఎస్.బాబు, సంస్థ జనరల్ సెక్రటరీ కవిత రాణి, ఉపాధ్యాయులు, చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ప్రజలు

రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని 23వ వార్డులో 15 నెలలుగా రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయడం లేదని ప్రజలు సోమవారం స్పందన కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిరసన తెలిపి, ఆర్‌డిఒను కలిసి సమస్యలు వివరించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వార్డు కన్వీనర్ సాయిశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తమ వార్డులో ఎండియు వాహనాల ద్వారా ప్రతి నెల సక్రమంగా బియ్యం పంపిణీ చేయకపోగా ప్రయివేటు వ్యక్తుల పర్యవేక్షణలో డీలర్లు, వాలంటీర్లు, విఆర్‌ఒలు కుమ్మక్కై కేటాయించిన బియ్యంలో సగమే పంపిణీ చేస్తూ ప్రతి నెల తమకు రావాల్సిన బియ్యాన్ని అమ్ము కుంటూన్నారన్నారని ఆరోపించారు. పలుమార్లు ఫిర్యాదు చేయగా బియ్యం రాలేదని సమాదానం చెబుతున్నారని తెలిపారు. అవకతవకలుకు పాల్పడు తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు కృష్ణమ్మ మమత, బాలమ్మ, జయమ్మ, చంద్రశేఖర్, లక్ష్మీదేవి, రాము పాల్గొన్నారు.

అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలి : గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా సమస్యల సత్వర పరిష్కారార్థం జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ గిరీష అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జెసి ఫర్మన్ అహ్మద్, డిఆర్‌ఒ సత్యనారాయణ హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఎ, రీ ఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని సూచించారు. అనంతరం ప్రజల నుంచి నుంచి వారు అర్జీలను స్వీకరించారు.

ప్రత్యేక హోదా ఎందుకివ్వలేదు? : విసికె

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రత్యేక హోదా, ప్యాకేజి, రాజధాని, పోలవరం ప్రాజెక్టుల నిర్మాణానికి నిధుల కేటాయింపు తోపాటు విభజన హామీలన్నీ అమలు చేసి ఆంధ్రప్రదేశ్‌ను అత్యంత వేగంగా అభివృద్ధి చేస్తామని తిరుపతి సభలో ప్రజలకు వాగ్దానం చేసిన నరేంద్రమోడీ తొమ్మిదేళ్లయినా ఎందుకు వాటి అమలుకు పూనుకోవడం లేదని విసికె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ ప్రశ్నించారు. సోమవారం స్థానిక విసికె పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేవంలో ఆయన మాట్లాడుతూ తిరుపతి సభలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కడమే కాక, ఎంతో మంది ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేట్ పరం చేస్తూ, సీమాంధ్రుల ఆస్తిని అదానీకి అప్పజెప్పేందుకు బిజెపి రంగం సిద్ధం చేసిందని విమర్శించారు. అమిత్ షా, నడ్డా ఏమొహం పెట్టుకొని ప్రజల ముందుకొచ్చారని నిలదీశారు. గత ఎన్నికల్లో ప్రజలు చాలా చోట్ల బిజెపికి నోటాకంటే తక్కువ ఓట్లే వేశారని, అయినా వీరికి సిగ్గురాలేదన్నారు. పొత్తులతో మళ్ళీ ప్రజల ఓట్లు దండుకొనేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. బిజెపి మునిగిపోయే పడవ లాంటిదని, దానితో ఎవరు జత కట్టినా మునిగిపోవడం ఖాయమని స్పష్టం చేశారు. సమావేశంలో విసికె, బాస్ సంస్థల నాయకులు ముత్యాల మోహన్, మనోహర్‌రెడ్డి, సొన్నికంటి రెడ్డెప్ప, సూర్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విసికె నాయకులు శివప్రసాద్

షిర్డీకి స్పెషల్ బస్సులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

షిర్డీకి వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం తక్కువ ఖర్చుతో రాయచోటి నుంచి ఈనెల 14న స్పెషల్ సూపర్ లగ్జరీ బస్సు నడుపుతునట్లు డిపో మేనేజర్ ధనుంజయ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ షిరిడికి రాను పోను బస్సు ఛార్జీ పెద్దలకు రూ. 4800, పిల్లలకు రూ. 2500 అని చెప్పారు. తుల్జా పూర్, శనిసింగాపూర్, పండరిపురం చూపించుకుని తిరిగి రాయచోటికి చేరుతుందని అన్నారు. షిర్టీని దర్శించుకోవడానికి జనం ఆసక్తి చూపుతారని, కొంత మంది ఎలా వెళ్లాలో తెలియక ఇబ్బందులు పడుతుంటారని. అలాంటి వారి కోసం స్పెషల్ బస్సు ఏర్పాటు చేశామన్నారు. ఆర్టీసీలో తక్కువ ఖర్చుతో, సురక్షిత ప్రయాణం చేయవచ్చని అన్నారు.అలాగే ఈనెల 17న గోవాకు సూపర్ లగ్జరీ బస్సు నాలుగు రోజుల యాత్ర కోసం పెద్దలకు రూ.3500, పిల్లలకు రూ. 2000 ఛార్జీ నిర్ణయించామన్నారు. పౌర్ణమికి అరుణాచలం అల్ట్రా డీలక్స్ బస్ ఏర్పాటు చేశామని, జులై 2న ఉదయం నాలుగు గంటలకు బయలుదేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, గిరి ప్రదక్షిణ చేసి మరుసటి రోజు రాయచోటికి చేరుతుందని అన్నారు. ఛార్జీ 87గా నిర్ణయిం చామన్నారు. .ప్రతి యాత్రకు రిజర్వేషన్ సౌకర్యం ఉందని అవకాశాన్ని రాయచోటి, చుట్టూ పక్క ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9959225776 లేదా రిజ్వేషన్ కౌంటర్ 8885177798లలో సంప్ర దించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ సుబ్బమ్మ పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం

రాజంపేట అర్బన్ : రక్తదానం మహాదానమని, రక్తదానంతో మనిషికి ప్రాణం పోయవచ్చునని అదనపు డిఎంహెచ్ఒ చెన్నకృష్ణ తెలిపారు. 14వ తేదీన ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం డిప్యూటీ డిఎంహెచ్ఒ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని వైద్యులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ రక్తదాన దినోత్సవం రోజు నిర్వహించే రక్తదాన శిబిరానికి ప్రతి పిహెచ్‌సి, ఏరియా ఆసుపత్రి నుండి ఐదుగురు చొప్పున రక్తదానం చేసేందుకు శిబిరానికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ పి.వి.నాగేశ్వరరావు, డాక్టర్ శేఖర్, వైద్యులు పాల్గొన్నారు.

పేదలపై విద్యుత్ ఛార్జీల భారం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మాట్లాడుతున్న అలీఖాన్

మూడు నెలల నుంచి పేదలపై విద్యుత్ ఛార్జీల భారం పడుతుందని అన్నమయ్య జిల్లా డిసిసి మైనార్టీ ప్రెసిడెంట్ ఆడిటర్ మన్సూర్ అలీఖాన్ అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది రెండు మూడు నెలల నుంచి విద్యుత్ బిల్లులో అనవసరమైన అదనపు ఛార్జీలు పేదలపై మోపుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ ఛార్జీలు చెల్లించలేక అవస్థలు పడుతున్నారని వాపోయారు. ఒకపక్క నిత్యావసర సరుకులు ధరలతో పూట గడవక ఇబ్బందులు పడుతుంటే మరో పక్క విద్యుత్ బిల్లుల భారం వారిని మరింత కుంగదీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో అదనపు ఛార్జీలు మోపడం చాలా దుర్మార్గమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 200 యూనిట్ల వరకు పేదలకు ఉచితంగా కరెంటు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాబోయే రోజుల్లో ఎలాంటి అదనపు ఛార్జీలు మోపకుండా తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు.

ఆర్‌డిఒకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

శ్రీసాయి విద్యాలయంపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలోని నూనెవారిపల్లె రోడ్డులోని శ్రీ సాయి విద్యాలయ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని, ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలకు విద్యా శాఖ అధికారులు వత్తాసు పలుకుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ అన్నారు. ఆ పాఠశాలల పైన చర్యలు తీసుకోవాలని సోమవారం ఆర్‌డిఒకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ శ్రీ సాయి విద్యాలయ పాఠశాల యాజమాన్యం విద్యా శాఖ నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా అక్రమంగా అడ్మిషన్లు నిర్వహిస్తూన్నారన్నారు. పలు మార్లు విద్యాశాఖధికారులకు ఫిర్యాదు చేసినా వారికే వాత్తసు పలుకుతున్నారని విమర్శించారు. ఉన్నతాధికారుల అనుమతి లేకపోయినప్పటికీ ఒకే పేరుతో రెండు క్యాంపస్లు నిర్వహిస్తున్నా విద్యా శాఖ అధికారులకు తెలిసినప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. శ్రీ సాయి విద్యాలయలో ప్రధానంగా నలుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాల నిర్వహణ మొత్తం చూస్తున్నారని, వారి పైన తక్షణమే కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి వారిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యను ఒక పెద్ద వ్యాపార కేంద్రంగా చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు అడ్మిన్‌కు వచ్చే విద్యార్థి చేత నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్‌కు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నారని, కేవలం నర్సరీకే రూ.30 వేలు నుండి రూ.40 వేల వరకు తల్లిదండ్రుల దగ్గర నుండి వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. పలు ప్రయివేట్ పాఠశాలలు సిబిఎస్ఇ, జెఇఇ మేయిన్స్, ఐఐటి, బోధించే అర్హత కలిగిన ఉపాధ్యాయులు లేకపోయినపప్పటికీ ఉన్నట్లు ప్రచారం నిర్వహిస్తున్నారని, గుర్తింపు లేని పాఠశాల వివరాలు విద్యాశాఖ అధికారులు పత్రికలకు తెలియచేయాలన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి శ్రీ సాయి విద్యాలయ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకొని మిగిలిన కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మనోజ్, రాజంపేట ఉపాధ్యక్షులు సుభాన్, గురుప్రసాద్, సాయి, శివకుమార్ పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులను పరిష్కరించండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకోవాలని పురపాలిక కమిషనర్ కె.ప్రమీల తెలిపారు. సోమవారం పురపాలిక కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ప్రజలు తీసుకొచ్చిన అర్జీలను తీసుకున్నారు. మొత్తం నాలుగు సమస్యలు వచ్చాయన్నారు.మ్యుచువల్ ఎయిడెడ్ లేబర్ కాంట్రక్ట్ సొసైటీ తరుపున మున్సిపల్ ఆఫీసులో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు విధుల నుండి తొలగించారని, మళ్ళీ విధులోకి తీసుకొవాలని, కోర్టు ఇచ్చిన అర్డు ద్వారా మాకు నాయ్యం చేయలని, చంద్ర కాలనీ నివాసులు పైపు లైను దెబ్బ తినడం వల్ల నీరు సరిగా రాలేదని అక్కడ ప్రజలు చాలా ఇబ్బందిగా వున్నందనే సమస్యలపై అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో పురపాలక సంఘం అన్ని శాఖాధిపతులు పాల్గొన్నారు.

'వైద్య ఆరోగ్య శాఖలో వంద శాతం లక్ష్యాలను సాధించాలి'

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలో ఎన్‌సిడి-సిడి సర్వే వందశాతం లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ గిరీష వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశిం చారు. సోమవారం కలెక్టరేట్‌లో వైద్య శాఖకు సంబంధించిన అంశాలపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రక్తహీనతలతో బాధపడుతున్న వారిని గుర్తించి ఎప్పటికప్పుడూ రక్త పరీక్షలు నిర్వహించి రక్తహీనత నివారణకు కృషి చేయాలన్నారు. ఇంటి వద్దకే వైద్య సేవలు -ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా డయాబెటిస్, హైపర్ టెన్షన్ రోగులకు తరచూ వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలో అతిసార ఉధృతి నివారణకు తీసుకున్న చర్యలపై వైద్యాధికారులతో సమీక్షించారు. అతిసార వ్యాధి నివారణకు వారి, జింక్ వాడకంపై అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లలకు విరేచనాలు అవుతున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆశా, ఎఎన్ఎం, ఆరోగ్య కార్యకర్తలు తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ డిఐఒ డాక్టర్ ఉషశ్రీ, వైద్యాధికారులు పాల్గొన్నారు.

సంతృప్తికర స్థాయిలో పరిష్కరించండి

జగనన్నకు చెపుదాం కార్యక్రమంలో భాగంగా స్పందన దరఖాస్తుల మీద దృష్టి సారించి వాటిని సంతృప్తికర స్థాయిలో పరిష్కరించాలని, ఎలక్షన్స్‌కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని హౌసింగ్ కి సంబంధించిన ఇకెవైసి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి స్పందన, రీ సర్వే, ఎలక్షన్స్, హౌసింగ్, గ్రామ వార్డు సచివాలయాలు, సంపూర్ణ పోషణ తదితర అంశాలలో జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, ఎస్‌హెచ్ఒలు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఎపిఎంలు, ఎపిఒలు, సిడిపివోలు, మండల సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీసు శాఖ వారికి వచ్చే దరఖాస్తులలో సివిల్ గొడవలు ఉంటే అటువంటి సమస్యలకు తగిన విధంగా దరఖాస్తులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖలలో రీఓపెన్ అయిన అర్జీలపై ఆయా శాఖ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అసెంబ్లీ నియోజకవర్గ వారీగా వస్తున్న దరఖాస్తులను త్వరగా పరిశీలించి పరిష్కరించాలని తహశీల్దార్లను ఆదేశించారు. హౌసింగ్‌లోని ఇకెవైసి ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలన్నారు. జిల్లాలో రీ సర్వే లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని, హద్దురాళ్ళునాటే ప్రక్రియలో ప్రగతి, రెండవ దశ రీ సర్వే గ్రామాలలో ప్రగతి తదితర అంశాలలో సమీక్షించారు. గ్రామ వార్డు సచివాలయాలలో ప్రభుత్వం అందిస్తున్న సేవలు మీద సమీక్షిస్తూ ఎస్‌డిజి, ఆయుష్మాన్ భారత్ ఇకెవైసి, సంపూర్ణ పోషణ, గడపగడపకు మన ప్రభుత్వం, నైపుణ్యాభివృద్ధి, జగనన్న తోడు వంటి సేవలలో మంచి పురోగతి ఉందని, పురోగతిని ఇంకా పెంచాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, డిఆర్‌ఒ సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్‌డిఒలు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

పాదయాత్రలో పాల్గొన్న ఫర్వీన్‌తాజ్

పాదయాత్రకు పెరుగుతున్న ప్రజాదరణ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్ర ప్రజల నుంచి ప్రజాదరణ పెరుగుతుందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఎస్.ఎం.ఫర్వీన్‌తాజ్ పేర్కొన్నారు. కడప జిల్లా బద్వేల్ నియోజకవర్గంలో అశేష జనవాహిని మధ్య లోకేష్ పాదయాత్ర సాగుతోందని అన్నారు. అన్నివర్గాల ప్రజల నుంచి పాదయాత్రకు సంపూర్ణ మద్దతు లభిస్తుందని తెలిపారు. ఆయనతో కలిసి పాదయాత్రలో పాల్గొనడం రాజకీయంగా తనకు ఎంతో దోహదపడుతోందని వెల్లడించారు. పాద యాత్రలో నూర్‌మొహమ్మద్, పిటిఎం మండలానికి చెందిన టిడిపి నాయకులు చంద్ర మోహన్‌రెడ్డి పాల్గొన్నట్లు ఆమె తెలిపారు.

ఒపిఎస్ సాధనే ప్రధాన లక్ష్యం

ప్రజాశక్తి-కలికిరి

ఒపిఎస్ సాధనే ఎపిటిఎఫ్ ప్రధాన లక్ష్యమని జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. గత ఎన్నికల వేళ పదేపదే సిపిఎస్‌ను వారంలో రద్దు చేస్తామని, ఒపిఎస్‌ను పునరుద్ధరిస్తామని హామీనిచ్చిన సిఎం జగన్ ఇప్పుడు జిపిఎస్‌ను ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. పిఆర్‌సి బకాయిలును వచ్చే నాలుగేళ్ళు 2027వ సంవత్సరం వరకూ విడతలవారీగా ఇస్తామని చెప్పడంలో విశ్వసనీయత లేదన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-సుండుపల్లి

స్థానిక గ్రామపంచాయతీలో ఏటిగడ్డ రాచపల్లి దగ్గర నూతనంగా నిర్మిస్తున్న శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి కోనేరువాండ్లపల్లికి చెందిన దాతలు సామనేని రాజనరేంద్ర(రవి), సునీత దంపతులు లక్ష రూపాయలు విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు గంగరాజు, రామరాజులు దాతలను అభినందించారు.

పాల ఏకరిలకు చేసిందేమి లేదు

ప్రజాశక్తి-రామాపురం

పాలఏకరి కులాలకు ప్రభుత్వం ఆర్భాటాలు తప్ప చేసిందేమి లేదని జిల్లా ఉపాధ్యక్షులు గురిగింజ కుంట భాస్కర్‌నాయుడు అన్నారు. సోమవారం రామాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్, 12 మంది డైరెక్టర్లు నియమించారని రెండు సంవత్సరాలుగా కావస్తున్నా ఏ పేదవానికి కూడా న్యాయం జరగలేదని అన్నారు. రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి కులాలకు సంబంధించిన 55 కార్పొరేషన్‌లు ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తమ కులానికి చెందిన కార్పొరేషన్ ఒకటి కార్పొరేషన్లు రెన్యువల్ చేయకపోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 29న రాయచోటిలో పాలఏకరి రాష్ట్ర అధ్యక్షుని ఎన్నిక జరుగుతుందని, అన్ని జిల్లాల నుంచి పాలఏకరి అధ్యక్షులు హాజరు కావాలని కోరారు.

సిపిఒకు వినతి పత్రం సమర్పిస్తున్న తల్లెం భరత్

అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలి

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

మండల పరిధిలోని మంగంపేట కాపల్లి హరిజనవాడ అరుంధతివాడ, కొత్త మంగంపేట, కొత్త అగ్రహారం ఆర్‌ఆర్ సెంటర్లలో నివసిస్తున్న యాభై ఏళ్ల నిండిన అర్హులందరికీ ఎపిఎండిసి సంస్థ ద్వారా పింఛన్ అందించాలని వైసిపి నాయకులు, రైల్వే బోర్డ్ నెంబరు తల్లెం భరత్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. అర్హులందరితో సోమవారం సిపిఒ సుదర్శన్‌రెడ్డిని మర్యాదపూర్వ కంగా కలిసి వినతి పత్రం అందించారు. 50 సంవత్సరాలు నిండిన వారితోపాటు వితంతు పింఛన్లు కూడా అందజేయడం జరుగుతుందని అన్నారు. ఇప్పటివరకు పింఛన్ అందని అర్హులందరూ దర ఖాస్తు చేసుకుంటే జాబితా పరిశీలించి పింఛన్లు అందజేస్తామని సిపిఒ సుదర్శన్‌రెడ్డి హామీనిచ్చారు. వికలాంగులు, వృద్ధులు, వితంతువులు అర్హత కలిగిన వారందరికీ అమలు చేయాలని లబ్ధి దారులతో కలిసి సిపిఒకు విన్నవించారు. కార్యక్రమంలో శారదమ్మ, విజయమ్మ, సుభద్రమ్మ, శ్రీకాంత్, రమణ, వెంకటేష్, చైతన్య, రామచంద్రయ్య, లతా, సుబ్బమ్మ, ఎల్లమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

రేపు సామాజిక తనిఖీ బహిరంగ సభ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2022-23 సంవత్స రంలో వివిధ శాఖల్లో చేపట్టిన పనుల పై సామాజిక తనికి బహిరంగ సభ కార్యక్రమాన్ని ఈనెల 14న నిర్వహించనున్నట్లు ఎపిఒ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణఉపాధిహామీ పథకం ద్వారా మండలంలోని 10 గ్రామ పంచాయతీలలో ఏప్రిల్ 1,2022 నుంచి మార్చి 31,2023 వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందం మే నెల 20వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు తనిఖీ చేశారు. సామాజిక తనిఖీలో గుర్తించిన అంశా లపై సంబంధిత అధికారులతో ఈనెల 14న బుధవారం ఉదయం 10 గంటలకు ఉపాధిహామీ పథక భవనం ఆవరణంలో ఎన్‌ఆర్‌ఇజిఎస్, పంచాయతీరాజ్ పనులు, గ్రామీణ నీటి సరఫరాశాఖ, అటవీశాఖ పనులు, గృహనిర్మాణాలు, పశుసంవర్ధక శాఖ ద్వారా పశుగ్రాసం పెంపకం, గోకులం నిర్మాణం మొదలగు పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొనాలని తెలిపారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించండి

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలోని సచివాలయంలో పరిధిలో ప్రజాసమస్యలను తమ పరిధిలో విఆర్‌ఒలు సత్వరమే పారిష్కరం చేయాలని తహాశీల్దార్ రాము పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో గ్రామాలవారిగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. **మదనపల్లె అర్బన్ :** ప్రజల నుంచి అందే సమస్యలను ఎప్పటి కప్పుడు పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి వార్డు కౌన్సిలర్ షేక్ షబానా, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎస్‌ఎ కరీముల్లాలు సోమవారం పట్టణంలోని 14వ వార్డు నందు సోమవారం స్పందన కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు వార్డు ప్రజల సమస్యలు తెలుసు కొన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు, పొదుపు సంఘాల ఆర్పీలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

పిల్లలకు క్రీడలపై ఆసక్తి పెంచాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తల్లిదండ్రులు తమ పిల్లలకు క్రీడల పట్ల ఆసక్తి పెంచాలని సీనియర్ కోచ్‌లు పి.ప్రసాద్ రెడ్డి, నౌషాద్‌లు అన్నారు. స్థానిక బిటి కాలేజీ హాకీ మైదానంలో శాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి హాకీ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు క్రీడల పట్ల ఆసక్తి పెంచాలన్నారు. హాకీలో మదనపల్లెకు చెందిన క్రీడాకారులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో రాణించారని గుర్తు చేశారు. వేసవి శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులకు శాప్ ఆధ్వర్యంలో నడుస్తున్న స్పోర్ట్స్‌స్కూల్స్ ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి ట్రోఫీ, మెమెంటోలు అందించారన్నారు.

విద్యార్థులకు వరం..జగనన్న విద్యా కానుక

ప్రజాశక్తి-రాయచోటి

జగనన్న విద్యా కానుక విద్యార్థులకు ఒక వరమని డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం సంబేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాకానుక కింద బడులు తెరిచిన తొలిరోజే ప్రతి విద్యార్థికీ ఉచితంగా మూడు జతల యూనిఫాం క్లాత్ (కుట్టుకూలితో సహా), ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, స్కూలు బ్యాగు, బైలింగ్యువల్ (తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో ఉండే) పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్‌తో పాటు అదనంగా ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీషు-తెలుగు డిక్షనరీని ప్రభుత్వం అందిస్తుందన్నారు. పాఠశాలలోని 580 మంది విద్యార్థిని విద్యార్థులకు నాలుగో విడత జగనన్న విద్యాశాఖ కిట్లను పంపిణీ చేస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు జగనన్న విద్యా కానుక విద్యార్థులకు ఎంతో తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి , సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు చిదంబర్ రెడ్డి, వైసిపి సంబేపల్లి ఇన్‌ఛార్జి నాయకులు ఉదయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు ప్రతాపరెడ్డి, సర్పంచ్ అంచల రామచంద్ర, ప్రముఖ భువనేశ్వర్ రెడ్డి, గుండ్రె వెంకట రమణారెడ్డి, పగిడాల రమణారెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బుజ్జిరెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ వాసుదేవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **చిన్నమండెం :** మండల కేంద్రంలోని బాలుర హైస్కూల్లో 2023-24 సంవత్సరానికి గాను ప్రభుత్వం పంపిణీ చేసిన జగనన్న విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు రమణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఎజాస్‌అలీఖాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **కలికిరి :** జగనన్న విద్యా కానుక పంపిణి కార్యక్రమాన్ని ఎంపిపి వేంపల్లి నూర్జహాన్, గుట్టపాలెం సర్పంచ్ వెంకటరెడ్డి జడ్‌పిహైస్కూల్‌లో ప్రారంభించడం జరిగింది. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శారద, ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు సురేష్ భాస్కర, రియాజ్ పాల్గొన్నారు. **గాలివీడు :** స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో స్కూల్ కమిటీ చైర్మన్ కుందా లక్ష్మీ ప్రసన్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గేశ్వరరాజు ఆధ్వర్యంలో జగనన్న విద్యాకానుక పంపిణీ కార్యక్రమం చేశారు. వైస్‌ఎంపిపి మిట్టపల్లి యధుభూషణ్‌రెడ్డి పాల్గొని విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటయ్య, సోములనాయక్, రమణయ్య, ఫిరోజ్, భగీరతమ్మ షబానా, నారాయణమ్మ, గంగయ్య, మదీనా, వాణిశ్రీ, రమామని, ప్రమీల, నిర్మల విద్యార్థులు పాల్గొన్నారు. **కలకడ:** మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో జగనన్న విద్యా కానుకలు పంపిణీ చేశారు. మండల కేంద్రమైన కలకడ బాలికల గురుకుల పాఠశాల, ఆదర్శ పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాల, అన్ని ప్రాథమిక ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక సామాగ్రిని పంపిణీ చేసినట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్ చేతుల మీదుగా జగనన్న విద్యా కానుకల సామాగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ కమలాకర్‌రెడ్డి, కోన సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డి ,ఎంఇఒ మునీంద్రనాయక్, ప్రిన్సిపల్ పుష్పలత, మలంగుషావలి,

కలికిరి : విద్యార్థికి జగనన్న విద్యాకానుకను అందిస్తున్న ఎంపిపి నూర్జహాన్

మోడల్ పాఠశాల కమిటీ చైర్మన్ మస్తాన్‌అహ్మద్, విద్యా ర్థులు పాల్గొన్నారు. **రామాపురం :** 2023-24 విద్యా సంవత్సరానికి జగనన్న విద్య కానుకను మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఎంఇఒ రామకృష్ణుడు విద్యార్థులకు విద్యా కానుగా కిట్లను పంపిణీ చేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న 3750 మంది విద్యార్థులకు విద్యా కానుక అమలు చేయడం జరిగింది అన్నారు. **రామసముద్రం :** మండలంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం ప్రిన్సిపల్ మునిస్వామి నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గుణశేఖర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** మండలంలోని 53 ప్రాథమిక, ఆరు ప్రాథమికోన్నత, ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కస్తూరిభాగాంధీ బాలిక పాఠశాల, ఎపి మోడల్ స్కూల్, అంబేద్కర్ ఎస్‌సి గురుకుల పాఠశాలల్లో హాజరైన విద్యార్థులందరికీ జగనన్న విద్యా కానుక కిట్లను అందజేసినట్లు ఎంఇఒ రెడ్డి శేఖర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసి సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **నందలూరు :** నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఇఒ గంగిరెడ్డి ఆధ్వర్యంలో ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సౌభాగ్యం, నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ సూర్యనారాయణ, జిల్లా వక్ఫ్‌బోర్డ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్‌అమీర్, జెసిబి సుబ్బారెడ్డి, నడివీధి సుధాకర్, మండల ఉపాధ్యక్షులు అనుదీప్ జయసింహ, మండల కో-ఆప్షన్ సభ్యులు కలిముల్లా ఖాన్, శ్రీధర్ గౌడ్, ఆర్యవైశ్య సంఘ నాయకులు యంబలూరు నరసింహాశెట్టి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, శివశంకర్ రెడ్డి, పాల్గొన్నారు. **పెద్దమండ్యం:** స్థానిక మోడల్ స్కూల్‌లో జగనన్న విద్యాకానుక ఎంపిపి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ, సర్పంచ్ భాష, విశ్వనాధ్ పద్మావతి తిరుపాల్, ఎంపిటిసి, జయరామ్,మోడల్ ప్రిన్సిపల్ రామంజుల నాయిక్, హెచ్‌ఎంఎస్ రామచంద్రారెడ్డి, రామచంద్ర, విద్యాకమిటీ సభ్యులు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల కేంద్రమైన ఎస్‌బివిడి సభ హై స్కూల్ నందు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న విద్య కానుకల పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా ఎంపిపి ముద్దాబాబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో తహాశీల్దార్ నరసింహ కుమార్, ఎంపిడిఒ రఘురాం, ఎంఇఒ రంగనాథయ్య, ఎస్‌బివిడి సభ సంస్థల అధినేత నూకలశ్రీరాములు, పార్థసారథి, విద్యార్థులు ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మండలాభివృద్ధే ధ్యేయం' : ఎంపిపి

అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేస్తున్న ఎంపిపి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల అభివృద్ధే తన ధ్యేయమని పుల్లంపేట మండల అధ్యక్షులు ముద్దాబాబుల్ రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారు. చిట్వేలి రోడ్డు విస్తరణలో భాగంగా పుల్లంగేరు బ్రిడ్జి నుండి పాత బస్టాండు కూడలి వరకు 250 మీటర్ల సిమెంటు రోడ్డు, తారురోడ్డు కలిపి రూ.1.40 కోట్లు ఎన్‌ఆర్‌జిఆర్‌ఎస్ ప్రారంభించారు. పుల్లంపేట వాసుల చిరకాల కోరిక అయిన హిందూ శ్మశాన వాటికకు ప్రహరీ గోడ నిర్మాణం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబుల్ రెడ్డి మాట్లాడుతూ స్మశాన వాటిక ఆక్రమణకు గురికాకుండా చూస్తామని తెలిపారు. ఎవరైనా ఆక్రమణకు ప్రయత్నిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా ప్రజల సౌకర్యార్థం మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని తెలిపారు. పుల్లంపేట సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఎంపిటిసి రుణపడి ఉంటారని, గ్రామంలో ఎటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకొని వస్తే తక్షణమే పరిష్కార దిశగా అడుగులు వేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆకేపాటి శ్రీని వాసులురెడ్డి, పంచాయితీ కార్యదర్శి పెంచలయ్య, సుదర్శన్ రెడ్డి, పార్థ సారథి రెడ్డి, ఎస్‌బివిడి విద్యాసంస్థల కరస్పాండెంట్ నూకల శ్రీరాములు, మడగలం శ్రీనివాసులు, సామా రాంబాబు, వీసం సిద్ధారెడ్డి, బిట్టా శివరామయ్య, నరసారెడ్డి పాల్గొన్నారు.

కర్మాగారం భూమినిపరిశీలిస్తున్న టిడిపి శ్రేణులు

ఎంపీ, ఎమ్మెల్యే అండతోనే భూకబ్జా : 'నల్లారి'

ప్రజాశక్తి-పీలేరు

పట్టణంలో భూ ఆక్రమణలకు అడ్డుఅదుపు లేకుండా పోతుందని, వైసిపి నాయకులు కొందరు ఎంపీ, ఎమ్మెల్యేల అండతో విలువైన భూ కబ్జాలకు పాల్పడుతున్నారని టిడిపి జాతీయ ప్రధాన కార్య దర్శి, నియోజకవర్గ బాధ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆరోపించారు. పట్టణ శివారులోని తిరుపతి రోడ్డులో ఉన్న శ్రీకృష్ణదేవరాయ నూనెవిత్తుల కర్మాగారం భూమిని సోమవారం నియోజక వర్గ టిడిపి శ్రేణులతో కలసి ఆరా తీశారు. క్రీ.శే.మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు రాయలసీమ రైతుల కోసం పీలేరు-తిరుపతి రోడ్డులో గూడరేవు పల్లి గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 198,199లో దాదాపు 60 ఎకరాలకుపైగా భూమిని కర్మాగారం ఏర్పాటుకు కేటాయించారన్నారు. అలాగే అక్కడ నూనెవిత్తుల కర్మాగారం ఏర్పాటు చేసి రాయలసీమ రైతులకు అండగా నిలిచారని గుర్తు చేశారు. మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేల అండతో పీలేరు, కెవి పల్లి, వాల్మీకిపురం, కలకడ, కలికిరి, గుర్రంకొండకు చెందిన కొందరు వైకాపాకు చెందిన బడా బడా నాయకులు నూనె విత్తుల కర్మాగారం ప్రహరీని పగులగొట్టి భూ అక్రమాలకు పాల్పడి అంతస్తులపై అంతస్తులు కడుతున్నారని ధ్వజమెత్తారు. అధికారుల నిర్లక్ష్యంతో పేదలకు అన్యాయం జరుగుతోందని, టిడిపి అధికారంలోకి వస్తే అన్నీ కబ్జాదారుల కోరలు తీస్తా మని హెచ్చరించారు. ఇదేవిధంగా ప్రభుత్వ భూ అక్రమాలు కొన సాగితే రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ముగిసిన శ్రీమారెమ్మ జాతర

ప్రజాశక్తి-నందలూరు

నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ మారెమ్మ తల్లి పొంగళ్ళు మహోత్సవాలు ముగిశాయి. గ్రామ పురోహితులు బండాత్మకూరు శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మారెమ్మ తల్లికి అంజిస్వామి, నాగేంద్ర, మంచి కంటి నారాయణలు ప్రత్యేక పూలు, నగలతో అత్యంత సుందరంగా అలంకరణ గావించారు. ముగింపు కార్యక్రమంలో దుర్గారెడ్డి, కొత్తపల్లి శ్రీనివాసాచారి, హస్తవరం రాజారెడ్డి, గిద్దలూరు సుబ్బనర్సయ్య, సింగమాల సుబ్బరామిరెడ్డి, చాపల వెంకటసుబ్బయ్య, మద్దిలేటి, మారం రెడ్డి చంగల్ రాయుడు, చొప్ప నరసింహారెడ్డి, నాగిరెడ్డిపల్లె గ్రామప్రజలు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో మహిళలకు రక్షణ కరువు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

వైసిపి పాలనలో మహిళలకు రక్షణ కరువైందని రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఎస్‌ఎం.ఫర్వీన్‌తాజ్ పేర్కొన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయడం, కేసులు పెట్టడంతోనే వారి విధులు సరిపెట్టుకుంటున్నారని, రాష్ట్రంలో శాంతి భద్రతలను గాలికొదిలేశారన్నారు. సర్వసాధారణంగా కబ్జాలు, దౌర్జన్యాలు, రేప్‌లు,ాంపిస్టులు అంబోతుల్లా పెట్రోగిపోతున్నారని ఆమె దుయ్యబట్టారు. తాజాగా నెల్లూరులో పట్టపగలే నడిరోడ్డుపై యువతిని ఆగంతుకులు కిడ్నాప్ చేసి,రేప్ చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో అరాచకానికి ఇంతకంటే నిదర్శనం ఏమి కావాలన్నారు. ఈ ప్రభుత్వానికి మహిళలే రాబోయే ఎన్నికలలో తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఇప్పటి వరకు మహిళలపైన జరిగిన అత్యాచారాలు, దాడులు, హత్యలపై ప్రభుత్వం నిందితులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. మహిళల మానప్రాణాలు కాపాడలేని ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టా చంద్ర మోహన్‌రెడ్డి, ప్రభాకర్, గట్టు చంద్రన్న, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బిఎస్‌పి పట్టణ అధ్యక్షులుగా అన్సర్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బహుజన్ సమాజ్ పార్టీ పట్టణ అధ్యక్షులుగా అన్సర్‌బాషాను బిఎస్‌పి రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ నియమించారు. ఈ సందర్భంగా బందెల గౌతం కుమార్ మాట్లాడుతూ బిఎస్‌పి ఎస్‌సి,ఎస్‌టి, బిసి, మైనార్టీలను కలుపుకుంటూ రాజ్యాధికారంలో భాగస్వామ్యం చేయడమే లక్ష్మమన్నారు. కార్యక్రమంలో నాయకులు సహదేవ, రమణ, గంగాధర, పెద్దోడు, లక్ష్మీపతి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మల్లయ్య కొండకు సందర్శకుల తాకిడి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లి సమీపంలోని మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి ఆలయంనికి సోమవారం భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి వందలాదిమంది భక్తులు మల్లయ్య కొండకు సందర్శించారు. పూజారి ఈశ్వరప్ప మల్లికార్జునలు స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందించారు. మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి ప్రత్యేక పూజలతో మొక్కులు తీర్చుకున్నారు.సందర్శకుల తాకిడితో మల్లయ్య కొండ సందడిగా మారింది.

హక్కుల పోరాట సమితి అధ్యక్షులుగా కె.రఘుపతి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ఎరుకల హక్కుల పోరాట సమితిమండల అధ్యక్షులుగా కె. రఘుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం తంబాలపల్లిలో ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట జిల్లా అధ్యక్షులు అమావాస్య రమణ అధ్యక్షతన మండలంలో కమిటీ సమావేశం జరిగింది. మండల కమిటీ గౌరవ అధ్యక్షుడుగా పెద్ద వెంకటరమణ అధ్యక్షులుగా క్షేత్రి రఘుపతి, ప్రధాన కార్యదర్శిగా జయరాం, కార్యదర్శిగా రమాదేవి ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అమావాస్య రెడ్డయ్య, జిల్లా కమిటీ సభ్యులురమణ, కోనేటి శ్రీరాములు పాల్గొన్నారు.

బిసి చైతన్య సమితి ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి-సుండుపల్లి

ప్రధానకార్యదర్శి దేరంగుల వెంకటేష్

మండల ఎపి బిసి చైతన్య సమితి ఆధ్వర్యంలో సుండుపల్లికి చెందిన దేరంగుల వెంకటేష్‌ను జిల్లా యువజన ప్రధాన కార్యదర్శిగా బిసి చైతన్య సమితి అధ్యక్షుడిగా రమణను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుండుపల్లి మండలంలోని ఓ మారుమూల గ్రామమైన జికె రాజుపల్లి చెందిన నన్ను నమ్మి నన్ను బిసి చైతన్య యువజన కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. బిసి చైతన్య అభివృద్ధి కోసం ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి అభివృద్ధి కోసం ప్రతినిత్యం పనిచేస్తానన్నారు.

ఎంపిపి, ఎంపిడిఒకు వినతిపత్రం అందిస్తున్న ప్రిన్సిపల్

పాఠశాల అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి-కలకడ

పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ అనిత కోరారు. సోమవారం ఎంపిపి శ్రీదేవి రవికుమార్, మండల అభివృద్ధి అధికారి గంగయ్య లకు పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహారా సహకారాలు అందించాలని కోరారు. పాఠశాల ప్రాంగణంలో పండ్ల మొక్కలు, పూల మొక్కలు, నీడను ఇచ్చే మొక్కలను మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీపథకం ద్వారా నాటేందుకు సహకారం అందించాలని కోరారు. పాఠశాల ప్రాంగణంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాలని ఉంటే మొక్కలు విరివిగా పెంచి చక్కటి వాతావరణం నెలకొల్పేందుకు మొక్కలు ఎంత అవసరమని ఎందుకోసం ప్రతి అధికారి సహకరించాలని కోరారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-కలికిరి

తాగునీటి బోరును ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

మండలంలోని పత్తేగడ పంచాయతీ కొట్టాల గ్రామంలో నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి చొరవతో గ్రామంలో మంచి నీటి సమస్య పరి ష్కరించారు. గ్రామంలో రెండు వీధులకు మంచినీటి సమస్య ఎక్కువగా ఉందని స్థానిక ప్రజలు టిడిపి యువనేత వాసునూరి చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. చంద్రశేఖర్ ఈ సమస్యను కిశోర్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసు కెళ్లగా ఆయన వెంటనే స్పందించి పంచాయతీ నిధులతో కొత్త బోరు వేసి కొత్త మోటారు అమర్చి పైపులైను ఏర్పాటు చేయాలని తెలిపారు. వెంటనే స్పందించిన చంద్రశేఖర్ స్థానిక సర్పంచ్ రెడ్డమ్మలు గ్రామంలో కొత్త బోరు వేసి కొత్త మోటారు ఏర్పాటు చేసి పైపులైన్‌లో మంచినీరు సరఫరా చేశారు. గ్రామంలో మంచినీటి సమస్య తీరింది. గ్రామస్తులు కిశోర్‌కుమార్‌రెడ్డికి, చంద్రశేఖర్‌కు, స్థానిక సర్పంచ్ రెడ్డమ్మకు కృతజ్ఞతలు తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సిడిపిఒ పద్మావతి పేర్కొన్నారు. సోమవారం స్థానిక విశ్వ భారతి హైస్కూల్లో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకై ప్రభుత్వం కొత్త చట్టం తెచ్చిందని ఆమె తెలిపారు. బాలికలు అక్ర రవాణా ఎవరైనా ఇబ్బందులు పెడితే చైల్డ్ లైవ్ 1098 నెంబర్‌కు ఫోన్ చేసి తెలపాలన్నారు. బాలికలను హింసించడం, అత్యాచారాలను వ్యతిరేకించాలన్నారు. బాలికలుగా ఇబ్బందులు ఎదురవుతే 100/223 నెంబర్లకు పోలీసులకు ఫోన్ చేస్తే వెంటనే పోలీసులు అక్కడ చేరు కుంటారని అన్నారు. ప్రతి పిల్లవాడు బడిలో ఉండాలని పిల్లలను బడికి పంప కుండా పనులకు పంపిస్తే చట్టరీత్యా నేరమన్నారు.కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ దాద్వి అరుణ్‌కుమారి, అరుణాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

హార్డ్‌వేర్ దుకాణం దగ్ధం : రూ.30 లక్షలు నష్టం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

హార్డ్‌వేర్ దుకాణంలో ఎగిసి పడుతున్న మంటలు

పట్టణంలోని తరిగొండ రోడ్డులోని ఎంకె హార్డ్‌వేర్ దుకాణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో దాదాపు రూ.30 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. గుర్రం కొండ మండలం మర్రి పాడుకు చెందిన ఉమ్మర్ వాల్మీకిపురం పట్టణం తరిగొండ రోడ్డులో హార్డ్‌వేర్ దుకాణం నడుపుతున్నాడు. ఈ దుకాణంలో పెయింట్స్, ప్లాస్టిక్, కెమికల్స్, ఎలక్ట్రిక్ వస్తువులు ఉండడంతో పాటు మిద్దెపైన గోడౌన్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. సోమవారం సాయంత్రం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించడంతో దుకాణంలోని వస్తువులు భారీగా అగ్నికి ఆహుతి అయ్యాయి. మంటలు, పొగ కమ్మేయడంతో పక్కనే ఉన్న మరో రెండు దుకాణాలు సైతం దెబ్బతిన్నాయి. వాల్మీకిపురం ఉపసర్పంచ్ బిడ్డల కేశవ రెడ్డి హుటాహుటిన పంచాయతీ ట్యాంకర్లను పిలిపించి, స్థానిక యువకుల సహకారంతో మంటలను అదుపుచేశారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు.

నాటుసారా నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

నాటుసారా తయారీ, విక్రయాలు చేస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ నాగేశ్వర రావు అన్నారు. సోమవారం అర్ధరాత్రి రాత్రి గస్తీ నిర్వహిస్తుండగా.. మండలంలోని చింతపర్తి పంచాయతీ మేకలవారిపల్లికి చెందిన తుపాకుల పెద్ద వెంకటరమణ అక్రమంగా టివిఎస్ మోటార్ సైకిల్‌పై నాటుసారా తరలిస్తు న్నాడు. ఈ క్రమంలో సిబ్బందితో కలసి దాడులు నిర్వహించి, అతని వద్ద ఉన్న 50లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని, తుపాకుల పెద్ద వెంకటరమణపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా తయారీ, విక్రయాలు చేయడం వలన కుటుంబాలు దుర్భరంగా మారుతాయన్నారు. విక్రయాలు చేస్తూ పట్టుబడడం వలన జైలు, కోర్టుల చుట్టూ తిరుగుతూ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. నాటుసారా తయారీ, విక్రయాలు మానేసి ఉపాధి హామీ పనులు, కూలీ పనులు చేసుకో వాలని సూచించారు.

భవన నిర్మాణ కార్మికుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఉరేసుకొని భవననిర్మాణ కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు..మండలంలోని, వలసపల్లి పంచాయతీ కృష్ణాపురంకు చెందిన రమణ కుమారుడు బాలకృష్ణ (22) భవన కార్మికుడిగా పనిచేసి జీవనం సాగిస్తున్నాడు. ఏం జరిగిందో ఏమో సోమవారం తను ఉంటున్న పడకగదిలోనే ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు గమనించి ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక మార్చురికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి దారుణ హత్య

ప్రజాశక్తి-పీలేరు

మండలంలోని గాలివారిపల్లి పంచాయతీ, బొప్పసముద్రం గ్రామంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల వివరాల మేరకు.. సోమవారం బొప్పసముద్రం గ్రామానికి చెందిన గణేష్(30) అనే యువకుడు వీధిలో పైపులైను పనులు చేయిస్తుండగా అదే గ్రామానికి చెందిన సాంబశివ, అతని కుటుంబ సభ్యులు ఆ పనులను అడ్డుకుంటూ గొడవకు దిగారని తెలిపారు. ఆ గొడవ కాస్తా పెరిగి పెద్దదై హత్యకు దారి తీసిందన్నారు. హత్య జరిగిన తీరును పరిశీలిస్తే అది పాత కక్షే అయి ఉంటుందన్న అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఎస్ఐ లోకనాథం సంఘటస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేపట్టారు.